అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి ఆర్థిక వితరణ చేస్తున్న దృశ్యం

రామంతాపూర్‌ : గూగుల్‌నగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి యాదవ సంఘం బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేత సర్వబాబుయాదవ్‌ రూ.1,01,116లను ఆలయ ప్రతినిధి మురళీధర్‌నాయర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం బాబుయాదవ్‌ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి ఇప్పటివరకు క్రమం తప్పకుండా ఆలయంలోని అయ్యప్పస్వామిని దర్శించుకుంటానని, స్వామివారి కృపతో అన్ని శుభాలే జరుగుతున్నాయన్నారు. దయాకర్‌ రెడ్డి, రేవు నరసింహ తదితరులున్నారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా రాంచంద్రారెడ్డి



కుషాయిగూడ: మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా కోట రాంచంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్ల పాటు ఆయన ప్లీడర్‌గా కొనసాగుతారని, ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆలోచింపజేసేలా నాటక ప్రదర్శన



చైతన్యరథం నాటికలోని ఓ సన్నివేశం

మల్లాపూర్‌: తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ, రవి అండ్‌ రవి ఆర్ట్స్‌ అసోసియేషన్‌ సంయుక్తాధ్వర్యంలో మల్లాపూర్‌ నెహ్రూనగర్‌ హనుమాన్‌ దేవాలయం వద్ద చైతన్య రథం సందేశాత్మక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ నాటకంలో జగపతి, ప్రసాద్‌ పాత్రలో మాడుగుల కృష్ణమోహన్‌,. ధనుంజయరావు పాత్రలో ఐరేని రమేష్‌గౌడ్‌, ఆటోడ్రైవర్‌ పాత్రలో గోవింద్‌ సత్యనారాయణ, జంగయ్యగౌడ్‌, నాగరాజు, మనుప్రియ నటించారు.

మహిళా శక్తి గొప్పది



కార్యక్రమంలో మాట్లాడుతున్న గీతామూర్తి

మల్కాజిగిరి: సమాజంలో మహిళా శక్తి గొప్పదని బీజేపీ సీనియర్‌ నాయకురాలు గీతామూర్తి అన్నారు. బుధవారం ఆనంద్‌బాగ్‌లోని శంకర విద్యాపీఠం (కనకరాజుతోట)లో మహిళాదినోత్సవం బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన గీతామూర్తి, ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్‌ అనంతలక్ష్మి మాట్లాడుతూ.. పురాణాల్లో కూడా మహిళల ప్రాముఖ్యత ఉన్నట్లే, కలియుగంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి మహిళ భిన్న రూపాల్లో సేవలందిస్తోందని, ఓర్పు ఇంటిని నడిపే నైపుణ్యత వారికే చెల్లిందన్నారు. నేటి సమాజంలో భిన్న రంగాల్లో ఎందరో మహిళా ప్రముఖులు దేశానికి కీర్తిని తీసుకొచ్చారని కొనియాడారు. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సీపీఎం నాయకుల సర్వే




సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

పోచారం: ప్రజా సమస్యలపై సీపీఎం నాయకులు బుధవారం రాజీవ్‌ గృహకల్ప కాలనీలో ఇంటింటా సర్వే నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతుంతో లేదో అడిగి తెలుసుకున్నారు. అన్నోజిగూడలోని ఎన్‌టీపీసీ చౌరస్తా నుంచి రాజీవ్‌ గృహకల్ప కాలనీ వరకు వీధి దీపాలు, డ్రైనేజీ సదుపాయం లేదని, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కారించాలని అధికారులను కోరతామని నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, సబిత, అలివేలి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

‘ఓటీఎస్‌’ ఆఫర్‌ !

జీవో 109 ద్వారా ‘వన్‌ టైమ్‌ సెటిల్‌మెంట్‌’



మల్కాజిగిరి సర్కిల్‌ కార్యాలయం

ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం మాఫీ

మల్కాజిగిరి, అల్వాల్‌ సర్కిళ్లలో ప్రత్యేక కార్యాచరణ

మల్కాజిగిరి/అల్వాల్‌: ఆస్తిపన్ను దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న వారికి ప్రభుత్వం ప్రకటించిన వడ్డీపై 90 శాతం మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి సర్కిల్‌ ఉప కమిషనర్‌ రాజు, అల్వాల్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌ శ్రీనివాస్‌రెడ్డి పన్ను చెల్లింపుదారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పన్ను చెల్లింపుల్లో ఇబ్బందులు పరిష్కరించడానికి ప్రతి శనివారం సర్కిల్‌ కార్యాలయాల్లో పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నారు. అప్పటికప్పుడు పన్ను చెల్లింపుదారుల సమస్యలను పరిష్కరించి పన్ను చెల్లించేలా వారిని సిద్ధం చేస్తున్నారు. ఈనెల 7న మున్సిపల్‌ అడ్మినిస్ట్రేషన్‌ విభాగం ద్వారా జీవో నెంబర్‌ 109 ద్వారా ఓటీఎస్‌ (వన్‌ టైమ్‌ సెటిల్‌మెంట్‌)ను తీసుకుని వచ్చారు.

మల్కాజిగిరి సర్కిల్‌లో....

మల్కాజిగిరి సర్కిల్‌ పరిధిలో వాణిజ్య, నివాస భవనాలకు సంబంధించి 99202 ఆస్తిపన్ను మదింపు (అసెస్‌మెంట్స్‌) చేసిన 99202 పీటీఐలు ఉన్నాయి. గతేడాది 2023-24 సంవత్సరానికి లక్ష్యం రూ. 50.27 కోట్లు ఉండగా.. రూ 47.14 కోట్లు వసూలయ్యాయి. ఈ ఏడాది 2024-2025 సంవత్సరానికి లక్ష్యం రూ.51.33 కోట్లు ఉండగా ఇప్పటి వరకు రూ 38.28 కోట్లు వసూలు చేశారు. ఇంకా రూ.11.99 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.64,514 మంది పన్ను చెల్లించారు.

డిమాండ్‌, లక్ష్యానికి వ్యత్యాసం...

వాస్తవంగా మొత్తం డిమాండ్‌ రూ. 172.38 కోట్లు ఉంది. చాలా అసెస్‌మెంట్స్‌ (పీటీఐ నెంబర్స్‌) డబుల్‌ ఎంట్రీ ఉండటం, కొన్ని కట్టడాలు కోర్టు కేసుల్లో ఉండటంతో ఈసారి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారిస్తున్నారు.

చెల్లించకపోతే...

ఆస్తిపన్ను చెల్లించకపోతే మొదట రెడ్‌ నోటీసులు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ స్పందించపోతే మున్సిపల్‌ చట్టం ప్రకారం జప్తు వారెంట్‌ జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 199 మందికి రెడ్‌ నోటీసులు, 48 మందికి జప్తు నోటీసులు జారీ చేశారు.

అల్వాల్‌ సర్కిల్‌ పరిధిలో....

సుమారు 58,710 పీటీఐ(ప్రాపర్టీ టాక్స్‌ నెంబర్స్‌) ఉన్నాయి. గతేడాది 2023-24 సంవత్సరానికి రూ. 33 కోట్లు వసూలయ్యాయి. ఈ ఏడాది 2024-24 సంవత్సరానికి లక్ష్యం రూ. 36 కోట్లు ఉండగా.. ఇప్పటి వరకు రూ. 29.8 కోట్లు వసూలయ్యాయి. 38,693 మంది పన్ను చెల్లించారు.

బాధ్యతగా భావించాలి



ప్రతి భవన యజమాని నిత్య జీవితంలో ఇంటికి సంబంధించి అనేక బిల్లులు క్రమం తప్పకుండా చెల్లిస్తుంటారు. ప్రతి ఏటా ఆస్తి పన్ను కూడా బాధ్యతగా చెల్లించాలి. ప్రభుత్వాలు కాలనీల్లో అభివృద్ధి పనులు చేయాలంటే పన్నులు చెల్లింపు కూడా ముఖ్యమే. పన్ను మదింపులో ఇబ్బందులు ఉంటే పరిష్కరించడానికి సిబ్బంది, అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. వడ్డీపై మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– గోధుమల రాజు, మల్కాజిగిరి సర్కిల్‌ ఉప కమిషనర్‌

లక్ష్యాన్ని చేరుకుంటాం



ఈ ఏడాది ఆస్తిపన్ను వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకుంటాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటీఎస్‌పై పన్ను చెల్లింపుదారులకు ప్రధాన కార్యాలయం నుంచి ఎస్‌ఎంఎస్‌ల ద్వారా సమాచారం వచ్చినప్పటికీ, ప్రత్యేక టీమ్స్‌ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. దీర్ఘకాలికంగా పన్ను చెల్లించని వారికి ఇప్పటికే రెడ్‌ నోటీసులు జారీ చేశాం. అప్పటికీ చెల్లించకపోతే చట్ట ప్రకారం వారి ఆస్తులను జప్తు చేసే అధికారం ఉంది.

– శ్రీనివాసరెడ్డి, అల్వాల్‌ సర్కిల్‌ ఉప కమిషనర్‌

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు



ఆర్‌కేపురంలో కేక్‌కట్‌ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శ్యామల, జగదీశ్వర్‌గుప్తా

అల్వాల్‌: వైఎస్సార్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌గుప్తా ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌కేపురంలో వైఎస్సార్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి శ్యామల హాజరై వైఎస్‌ఆర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రజల పార్టీ అని, ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందన్నారు. రాజన్న మీద అభిమానంతో జగనన్నపై ప్రేమతో ఈ పార్టీని మోస్తున్న ప్రతి కార్యకర్తకి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, శైలజాకిరణ్‌రెడ్డి, జ్యోతి, వెంకటరమణ, హరినాథ్‌గౌడ్‌, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ పర్యటన



ఉత్తమ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ సునీత

గౌతంనగర్‌: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌ రెడ్డి ఆదేశాల మేరకు గౌతంనగర్‌ కార్పొరేటర్‌ మేకల సునీతారాముయాదవ్‌ డివిజన్‌ పరిధి ఉత్తమ్‌నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. గత కొంతకాలంగా విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ద్వారా షార్ట్‌సర్క్యూట్‌ అవుతుందని దీంతో భయాందోళనకు గురవుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్‌ విద్యుత్‌ అధికారులకు సూచించారు. బీఆర్‌ఎస్‌ నాయకులు మేకల రాముయాదవ్‌, అనిల్‌, నర్సింగ్‌ రావు, శ్రీను, నందు, కాలనీవాసులు రాఘవేంద్ర రావు తదితరులున్నారు.

ఉద్యమకారుల హామీలను నిలబెట్టుకోవాలి

అల్వాల్‌: ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలుచేసేలా అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఉద్యమకారులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, పెన్షన్‌ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విస్మరించిందని ఆరోపించారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. మల్కాజిగిరి, అల్వాల్‌ సర్కిల్‌ ఉద్యమకారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లోనూ విశేష సేవలు



ఉప్పల్‌ లక్ష్మారెడ్డి కాలనీలో కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఉప్పల్‌: మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులకు దీటుగా విశేష సేవలు అందిస్తున్నారని ఉప్పల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఉప్పల్‌ లక్ష్మారెడ్డి కాలనీలో నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు అన్ని రంగాల్లో ప్రతి పనిలో మహిళా శక్తి ఉందన్నారు. నేడు మహిళ అత్యంత శక్తివంతంగా మారుతోందన్నారు. అనంతరం మహిళలు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. మాజీ కార్పొరేటర్‌ మేకల అనలాహనమంత రెడ్డి, స్వరూప, మేకల రజిని, మంజుల, సుశీల స్థానికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ



ఉప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఉప్పల్‌: అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. భగత్‌సింగ్‌ పోరాట పటిమ, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ లాంటి అమరుల త్యాగాలు, వారి విప్లవాత్మక భావజాలాన్ని గుర్తు చేసుకునేందుకు బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ర్యాలీకి ముఖ్యఅతిథిగా హాజరైన మేడ్చల్‌ జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు అవినాష్‌ జిల్లా కార్యదర్శి తదితరులు మాట్లాడుతూ.. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడానికి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే శక్తిని ఇవ్వాలని వారిని స్మరించుకున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

అల్వాల్‌: అల్వాల్‌ రంగధామనగర్‌లో విద్యాగణపతి, సీతాలక్ష్మణ హనుమత్‌సమేత శ్రీరామ చంద్రస్వామి, నవగ్రహ దేవతామూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం వాసుదేవానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం హోమాలు, ప్రాణప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, సంప్రోక్షణ అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, పావనీశివకుమార్‌, లక్ష్మయ్య, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, రాములు, అజయ్‌, రామచంద్రరావు, బాలకృష్ణ, సందీప్‌, మోహన్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



నిర్మల

మల్కాజిగిరి: మానసిక స్థితి సరిగ్గా లేని ఓ మహిళ అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్సై ఉపేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణుపురికాలనీకి చెందిన శరవణన్‌ భార్య నిర్మల (56) మానసికస్థితి సరిగ్గా లేదు. కుటుంబ సమస్యలు, ఆరోగ్య స్థితి బాగాలేని కారణంగా ఆమె ఈనెల 10న రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ఒత్తిడితో మరో వ్యక్తి..



నాగేశ్వరరావు

కుషాయిగూడ: మానసిక ఒత్తిడి కారణంగా ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌బీకాలనీ, కృష్ణానగర్‌ కాలనీకి చెందిన కురాకుల నాగేశ్వరరావు (36) కుషాయిగూడ డిపోలో కాంట్రాక్టు కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇటీవల కాలంలో మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 10న డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. సెల్‌ఫోన్‌ కూడా వెంట తీసుకెళ్లలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పలు చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం భార్య తులసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్‌

ఘట్‌కేసర్‌: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఘట్‌కేసర్‌ పోలీసులు బుధవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఏదులాబాద్‌లోని అండర్‌ పాస్‌ రోడ్డు సమీపంలోని ఇండియన్‌ గ్యాస్‌ ఏజెన్సీ వద్ద మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 40 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను ఘట్‌కేసర్‌కు చెందిన దంతూరి రాకేశ్‌, రోహిత్‌గా గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి



జలమండలి డీజీఎంలో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ ప్రభుదాస్‌



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ శాంతి

కుషాయిగూడ: తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని మీర్‌పేట్‌-హెచ్‌బీకాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ ప్రభుదాస్‌ వాటర్‌వర్క్స్‌ అధికారులను కోరారు. డివిజన్‌ పరిధిలోని హెచ్‌బీకాలనీ ఫేజ్‌-1,2లలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, మురుగుతో కలుషిత జలాలు వస్తున్నాయని, కాలనీల ప్రజల విజ్ఞప్తి మేరకు బుధవారం ఆయన వాటర్‌వర్క్స్‌ డీజీఎం సతీష్‌తో సమావేశమై తాగునీటి సమస్యను వివరించారు. గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య, కలుషిత జలాల సరఫరాతో కాలనీల ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని కలుషిత తాగునీటి సరఫరా సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. మాజీ కార్పొరేటర్‌ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, శివరాంప్రసాద్‌, గోవిందారెడ్డి, ప్రసాదరాజు, యాదిరెడ్డి, కాళిదాసు, రామకృష్ణ, బాల్‌రెడ్డి, వెంకటాచారి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను మెరుగుపర్చండి..

అల్వాల్‌: అల్వాల్‌ డివిజన్‌ కుమ్మరిబస్తీలో కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. బుధవారం కాలనీలో అంతర్గత రోడ్లు పూర్తిచేయాలని, తాగునీటి సరఫరా సమస్య, డ్రైనేజీ వ్యవస్థలను పునరుద్ధరించాలని కాలనీవాసులు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆమె కాలనీలో తాగునీటి సరఫరాను మెరుగుపరచడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నాయకులు యాదగిరిగౌడ్‌, సాజిద్‌, జలమండలి శేఖర్‌, రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందిస్తాం



11కేవీ ఫీడర్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎస్‌ఈ బ్రహ్మం, విద్యుత్‌ సిబ్బంది

బోడుప్పల్‌: విద్యుత్‌ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందిస్తామని ఎస్‌ఈ పి. బ్రహ్మం అన్నారు. బోడుప్పల్‌, చిలుకానగర్‌ పరిధిలో 33/11కేవీ సాయినగర్‌ సబ్‌స్టేషన్‌లో వేసవిని దృష్టిలో ఉంచుకుని రెండు కొత్త 11 కేవీ ఫీడర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రారంభించిన ఫీడర్ల వల్ల భవిష్యత్తులో ఎలాంటి లో ఓల్టేజ్‌ సమస్య లేకుండా 4 వేల మంది వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. 33/11 కేవీ బోడుప్పల్‌, 33/11 కేవీ సాయినగర్‌ సబ్‌స్టేషన్‌లో ఇప్పటికే రూ.4 కోట్ల వ్యయంతో రెండు 8ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో రెండు 12.5 ఎంవీఏ పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మరో రూ.4 కోట్లతో అదనపు డిస్ట్రిబ్యూషన్‌ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీని పెంచామన్నారు. డీఈ టెక్నికల్‌ సూర్యనారాయణ, డివిజనల్‌ ఇంజినీర్‌ ఆపరేషన్‌ సుబ్బారావు, డివిజనల్‌ ఇంజినీర్‌ ప్రొటెక్షన్‌ వెంకటనర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌ అధికారులతో కార్పొరేటర్‌ సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్‌ అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి ఇంజినీరింగ్‌ అధికారులతో సమీక్ష నిర్వహించారు. బుధవారం డివిజన్‌లో జరుగుతున్న సీసీరోడ్లు, బాక్స్‌ డ్రెయిన్‌, ప్యాచ్‌వర్క్స్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. అభివృద్ధి పనుల నిర్వహణలో ఆలస్యం జరగకుండా త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కొత్తగా గుర్తించి పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఇంజినీరింగ్‌ డీఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రవీణ్‌, ప్రశాంత్‌ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ నాగిళ్ల బాల్‌రెడ్డి, గోపాల్‌యాదవ్‌, సదానంద్‌గౌడ్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘సైన్స్‌ ఫేస్ట్‌’



ఉప్పల్‌: సైన్స్‌తోనే సమాజమని, చేసే ప్రతి పని సైన్స్‌తోనే ముడిపడి ఉందని, ‘తెలంగాణ స్టేట్‌ కమిషన్‌ ఫర్‌ ప్రొటెక్షన్‌ ఆఫ్‌ చైల్డ్‌ రైట్స్‌’ సభ్యురాలు అపర్ణ అన్నారు. బుధవారం ఉప్పల్‌ విజయపురికాలనీలోని బబుల్జ్‌ స్కూల్‌లో నిర్వహించిన ‘సైన్స్‌ ఫేస్ట్‌’ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్‌ ఫెయిర్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. చిన్న వయసులో చిన్నారులకు సైన్స్‌ పట్ల అవగాహన కల్పిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా అభినందించారు. దాదాపుగా 50 మంది విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాతావరణ కాలుష్యం, ప్రాథమిక వైద్యకేంద్రం, ప్రకృతి, రోడ్డు ట్రాన్స్‌పోర్టు, రోడ్డు భద్రత తదితర అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. విశిష్ట అతిథిగా ప్రముఖ న్యాయవాది రాజేంద్రప్రసాద్‌, పాఠశాల ప్రిన్సిపాల్‌ చందన్‌, కరస్పాండెంట్‌ శ్రీనివాస్‌గౌడ్‌, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసేలా చూడండి



గ్రేటర్‌ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

మల్కాజిగిరి: చెరువుల అభివృద్ధిలో హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి డివిజన్‌ కార్పొరేటర్‌ శ్రవణ్‌ గ్రేటర్‌ కమిషనర్‌ ఇలంబర్తికి వినతిపత్రం అందజేశారు. బుధవారం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. వేర్వేరు విభాగాల పరిధిలో చెరువులు ఉండటంతో అభివృద్ధి కుంటుపడటమే కాకుండా పట్టించుకునే వారే లేకుండా పోయారన్నారు. హెచ్‌ఎండీఏలో ప్రజావాణి కార్యక్రమం కూడా లేదని, దీంతో సమస్యను వారి దృష్టికి తీసుకొచ్చే అవకాశం ఉండటం లేదన్నారు. హెచ్‌ఎండీఏ కేవలం వ్యాపార దృక్పదంతోనే చెరువులను చూస్తున్నాయని, వాటి అనుమతుల జారీతోనే కాలం గడుపుతున్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి గుర్రపుడెక్క, పారిశుద్ధ్యం, పార్కులు, టాయిలెట్స్‌ నిర్వహణ జరుగుతోందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెరువులను జీహెచ్‌ఎంసీ చేపట్టి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా అదే విభాగం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చామని, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

చేనేత ఉత్పత్తుల ప్రదర్శన




చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న వినియోగదారులు

అల్వాల్‌: కుటీర పరిశ్రమల్లో ఉత్పత్తి చేసే వస్తువులను ప్రదర్శనలో ఉంచామని కళాసిల్క్‌ ప్రదర్శన నిర్వాహకులు వికాస్‌జైన్‌ అన్నారు. బుధవారం అల్వాల్‌లోని సాయిగార్డెన్‌లో ప్రదర్శన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న, మధ్యతరగతి వారికి అవసరమయ్యేలా అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయని, ఇలాంటి ప్రదర్శనతో ఉత్పత్తిదారులకు మేలు జరుగుతుందన్నారు. కూరగాయల నుంచి మొదలుకొని గృహ అలంకరణకు అన్ని రకాల వస్తువులను అందుబాటులో ఉంచామని తెలిపారు.

తల్లి మందలించిందని..

విద్యార్థి అదృశ్యం



సత్యసాకేత్‌

అల్వాల్‌: విద్యార్థి అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్‌ భరణికాలనీకి చెందిన శ్రీవల్లి కుమారుడు సత్యసాకేత్‌ (17) ఇంటర్‌ సెకండ్‌ ఇయర్‌ చదువుతున్నాడు. తరచూ సెల్‌ఫోన్‌ చూస్తుండటంతో తల్లి మందలించింది. ఈనెల 11న ఆమె ఉద్యోగానికి వెళ్లిన తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.